
సాక్షి ఖమ్మం

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



పోటీలకు మార్గం సుగమం

జిల్లా స్థాయి పాఠశాలల క్రీడాపోటీల నిర్వహణ కోసం డీఈఓ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రణాళిక ఖరారు చేశారు. 8లో



గురుకులంలో విచారణ

బోనకల్‌లోని జ్యోతిబాపూలే గురుకులంలో జరిగిన ప్రమాదంలో విద్యార్థి గాయపడిన నేపథ్యాన తహసీల్దార్ విచారణ చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల చిరు జల్లులు కురిసే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆలయ భూముల్లో ఆక్రమణలు తొలగిస్తాం



భూమి సర్వే చేస్తున్న అధికారులు

మధిర: మధిరలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ భూముల్లో ఆక్రమణలను తొలగిస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ సమత తెలిపారు. ఇటీవల రామాలయ భూముల్లో రోడ్ల నిర్మాణం జరుగుతుందనే సమాచారంతో ఆలయ చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు, అధికారులు పరిశీలించారు. ఈక్రమంలోనే గురువారం భూమిని సర్వే చేశారు. ఆలయానికి సంబంధించి 2.17 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి బాధ్యులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ భూముల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వంకాయలపాటి నాగేశ్వరరావు, హరి రవిశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 15వ తేదీన జరిగే స్వాతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన శకటాలను సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

23 చెక్‌డ్యాంలకు రూ.88.34కోట్లు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 23 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈమేరకు రూ.88,34,75,000 మంజూరు చేస్తూ గురువారం జీఓ జారీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా 200పైగా చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు చేయగా, జాబితాలో జిల్లా నుంచి 23 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 40చెక్‌డ్యాంల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల అంచనాలతో జలవనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు సమర్పించగా తొలివిడతగా 23 చెక్‌డ్యాంలకు నిధులు మంజూరయ్యాయి. అయితే, మిగిలినవి కూడా పరిశీలనలో ఉన్నాయని జలవనరులశాఖ సీఈ శంకర్ నాయక్ తెలిపారు. కాగా, ఖమ్మం నియోజకవర్గంలో ఒక చెక్‌డ్యాంకు రూ6.38కోట్లు, పాలేరు నియోజకవర్గంలో ఐదింటికి రూ.26.06కోట్లు, మధిర నియోజకవర్గంలో రెండు చెక్‌డ్యాంలకు రూ.11.22 కోట్లు, వైరా నియోజకవర్గంలో ఐదు చెక్‌డ్యాంలకు రూ.10.76కోట్లు, సత్తుపల్లి నియోజకవర్గంలో పది చెక్‌డ్యాంల నిర్మాణం కోసం రూ.33.92 కోట్లు మంజూరయ్యాయి. కాగా, ఖమ్మంలో మున్నేరుపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.63 కోట్లు త్వరలోనే విడుదలయ్యే అవకాశముందని సమాచారం.

ఔట్‌సోర్సింగ్ అభ్యర్థుల జాబితా విడుదల

ఖమ్మంగాంధీచౌక్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని చైల్డ్ హెల్ప్‌లైన్-1098లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలకు అందిన దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని జిల్లా సంక్షేమ అధికారి తాల్లూరి సుమ తెలిపారు. ఈ మేరకు అభ్యర్థుల నుంచి అర్హులు, అనర్హుల జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలను అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు.

గ్రామాల్లో జెడ్పీ సీఈఓ పర్యటన

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం, రామానుజవరం, తెలగవరం గ్రామాల్లో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు గురువారం పర్యటించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించే క్రమంలో పరిశీలనకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఎంపీడీఓ కె.శ్రీదేవి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెరిగిన వైన్స్ దరఖాస్తులు

ఖమ్మం క్రైం: జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించగా రోజురోజుకు దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. ఈనెల 4వ తేదీ నుంచి 122 వైన్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదట్లో రెండు అంకెలు కూడా దాటకపోగా, గురువారం మాత్రం 215 దరఖాస్తులు అందాయి. శుక్రవారం నుంచి ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటివరకు మొత్తం 290 దరఖాస్తులు అందాయి.

మరేదీ సాటిరాదు!

అత్యవసర సేవల్లో 108 వాహనం కీలకంగా నిలుస్తోంది. దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ వాహనాలు మొదలుకాగా, ఒక్క ఫోన్ కాల్‌తో పావు గంటలోపే ఘటనాస్థలికి చేరుకుంటున్న సిబ్బంది ఆపదలో ఉన్న వారిని ప్రాణాలు కాపాడుతున్నారు. క్షతగాత్రులు, గర్భిణులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఏ సమయంలోనైనా ఫోన్ చేస్తే వెంటనే వాలిపోయి వైద్యం అందించి ప్రాణదాతలుగా మారుతున్నారు. వైఎస్సార్ కంటే ముందు ఇలాంటి సేవలు అందుబాటులో లేకపోగా... అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు దక్కించుకోలేక వారి కుటుంబీకులు అష్టకష్టాలు పడేవారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న వైఎస్సార్ 108 వాహనాలను ప్రవేశపెట్టగా.. ఆయన భౌతికంగా లేకపోయినా వాహన సేవలు మాత్రం నేటికీ కొనసాగుతున్నాయి. – ఖమ్మం వైద్యవిభాగం



ఇటీవల కొత్తగా వచ్చిన 108 వాహనం

- అత్యవసర సేవల్లో తిరుగులేని 108
- గత ఆర్థిక సంవత్సరం 18వేల మందికి లబ్ధి
- అంబులెన్స్‌ల్లో 118 మంది ప్రసవం
- కొత్తగా వచ్చిన వాహనాలతో మరింత మెరుగైన సేవలు



108 వాహనంలో ప్రసవం చేసిన ఈఎంటీ (ఫైల్)

జిల్లాలో ప్రస్తుతం 108 వాహనాలు 16 తిరుగుతున్నాయి. వీటిలో ఎనిమిది కొత్త వాహనాలను ఇటీవలే ప్రభుత్వం కేటాయించింది. మిగతావి కూడా గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ప్రజాప్రతినిధులు రెండేళ్ల క్రితం సమకూర్చినవే. వీటిని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, ముదిగొండ, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, బోనకల్, కామేపల్లి, మధిర, బనిగండ్లపాడు, వైరా, సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు సెంటర్లకు కేటాయించగా రెండింటిని స్పేర్‌గా వినియోగిస్తున్నారు. గతంలో ఉన్న వాహనాలు తరచూ మొరాయిస్తుండడంతో సేవల్లో అంతరాయం ఏర్పడేది. కానీ ఇప్పుడు కొత్త వాహనాలు రావడంతో ఆ ఇబ్బందులు తొలగిపోవడమే కాక సత్వర సేవలు అందించడానికి మార్గం సుగమమైంది.

వాహనాల్లో 118 మందికి డెలివరీ

జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగినా ఫోన్ చేస్తే 15 నుంచి 20 నిమిషాలల్లోపు వాహనం చేరుకునేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. తద్వారా రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారికి సత్వర వైద్యం అంది ప్రాణాపాయం తప్పుతోంది. అంతేకాకుండా పురిటినొప్పులతో బాధపడే గర్భిణులను కూడా ఆస్పత్రులకు చేరవేస్తున్నారు. ఈక్రమంలో పరిస్థితి చేయిదాటితే అప్పటికప్పుడు వాహనాన్ని పక్కకు నిలిపి సిబ్బంది ప్రసవాలు కూ డా చేస్తున్నారు. కాల్ సెంటర్ ద్వారా వైద్యుల సూచనలు పాటిస్తూ తల్లీబిడ్డలకు హానీ జరగకుండా ప్రాణం పోస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం(2022–23)లో 108 వాహనాల్లో సిబ్బంది 118 మంది గర్భిణులకు ప్రసవం చేశారు.

18,502 మందికి అత్యవసర సేవలు

108 వాహనంలో ఒక అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు(ఈఎంటీ), ఒక డ్రైవర్(పైలట్) ఉంటారు. జిల్లాలో 16 వాహనాలు తిరుగుతుండగా.. సత్వరమే ఘటనాస్థలికి చేరేలా వీటిని సంబంధిత పీహెచ్‌సీల వద్ద అందుబాటులో ఉంచుతారు. కాల్ సెంటర్ నుండి ఫోన్ రాగానే పదిహేను నిమిషాల్లో చేరుకుని వైద్యం అందిస్తారు. 2022–23(ఏప్రిల్–మార్చి) ఆర్థిక సంవత్సరంలో ఈ వాహనాల ద్వారా రికార్డు స్థాయిలో సేవలు అందాయి. జిల్లా వ్యాప్తంగా 18,502 మందికి అత్యవసర వైద్యం అందించారు. ఇందులో సుమారు 2,633 మంది ప్రాణాలు నిలిపినట్లు రికార్డులు చెబుతున్నాయి.

102 ద్వారా గర్భిణులకు సేవలు

102 వాహనం ప్రవేశపెట్టాక తర్వాత గర్భిణులకు వైద్యం అందుతుండడమే కాక రవాణా కష్టాలు కూడా దూరమయ్యాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మ ఒడిలో భాగంగా 102 వాహనాల ద్వారా గర్భిణులను ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు పూర్తయ్యాక మళ్లీ ఇంటికి చేరవేస్తున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలు, బస్సుల్లో వెళ్లిరావాల్సిన ఇక్కట్లు తప్పాయి. గర్భం దాల్చిన మహిళల పేర్లు నమోదు చేసి సమయానుగుణంగా ఆశా, ఏఎన్‌ఎంలు 102 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. అలాగే, ప్రసవం సమయానికి ఆస్పత్రిలో చేర్పి మళ్లీ ఇంటికి చేర్చడమే కాక బాగోగులు కూడా చూసుకుంటున్నారు. జిల్లాలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో 16,024 ట్రిప్పుల ద్వారా 59,915 మంది గర్భిణులు 102 వాహనం సేవలు పొందారు. ప్రస్తుతం జిల్లాలో 102 వాహనాలు 11 ఉండగా.. ఇందులో ఏడింటిని ఇటీవలే ప్రభుత్వం సమకూర్చింది. మిగతా నాలుగు కూడా రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఈ వాహనాలు ఖమ్మం పరిధిలో రెండు, రఘునాథపాలెం, ముదిగొండ, కామేపల్లి, నేలకొండపల్లి, వైరా, మధిర, ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి పరిధిలో ఒక్కొక్కటి చొప్పున తిరుగుతున్నాయి.

ప్రణాళికాయుతంగా సేవలు



వైద్యపరంగా ఇబ్బంది లేకుండా వాహనాల ద్వారా ప్రణాళికాయుతంగా సేవలందిస్తున్నాం. వాహనం నిర్ణీత వ్యవధిలో ఘటనాస్థలికి చేరుకునేలా చూస్తున్నాం. తద్వారా ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మందికి అత్యవసర సేవలు అందించగలిగాం. మా సిబ్బంది కృషితో పలువురి ప్రాణాలు నిలిపాం. దీంతో జిల్లాకు అవార్డు కూడా లభించింది.
– భూమా నాగేందర్, 108, 102 ప్రోగ్రాం మేనేజర్

గత ఆర్థిక సంవత్సరం 108 ద్వారా అందించిన సేవల్లో కొన్ని..	గర్భిణుల సేవలు	ట్రామా కేసులు	కార్డియాలజీ కేసులు	శ్వాస సంబంధిత కేసులు	ఇతర అత్యవసర కేసులు
	5,654	2,829	614	983	8,394

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



వీఆర్‌ఏకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఎమ్మెల్యే సండ్ర, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిలాష, మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

- కేసీఆర్ నాయకత్వంలో వీఆర్‌ఏలకు న్యాయం జరిగింది
- ప్రభుత్వంలో చేరుతున్నందుకు అభినందనలు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖలకు కేటాయించిన గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్‌ఏ)లు పేదలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో 496 మంది వీఆర్‌ఏలకు ప్రభుత్వ ఉద్యోగులుగా నియామక ఉత్తర్వులను మంత్రి అందజేసి మాట్లాడారు. జిల్లాలో వీఆర్‌ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖల్లో పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్రప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన వీఆర్‌ఏల గౌరవం పెరగడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం దక్కిందని... తద్వారా పీఆర్సీ, పే స్కేల్ ఆధారంగా వేతనాలు అందుతాయని చెప్పారు. వీఆర్‌ఏలు ప్రభుత్వంలో భాగస్వాములు అవుతున్నందుకు అభినందిస్తున్నట్లు పువ్వాడ తెలిపారు.

సేవలు వెలకట్టలేనివి..

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్‌ఏలు అందించిన సేవలు, వారి శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. సుదీర్ఘ కాలంగా వారు ఆందోళనలు చేస్తున్నా ఏ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం వీఆర్‌ఏల శ్రమను గుర్తించి న్యాయం చేశారని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో 610 మంది వీఆర్‌ఏలు ఉండగా 61ఏళ్ల లోపు వయస్సు కలిగిన 496 మందిని వివిధ శాఖలకు కేటాయించినట్లు తెలిపారు. మిగతా వారికి సంబంధించి వారి వారసులకు త్వరలోనే పోస్టింగ్ ఇస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ బిడ్డలు ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న పలువురికి కూడా క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డి.మధుసూదన్‌నాయక్, జల వనరుల శాఖ సీఈ శంకర్ నాయక్, జెడ్పీ సీఈఓ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలొస్తేనే ప్రజలు గుర్తొస్తారా?

- టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు



మణుగూరులో ర్యాలీలో పొంగులేటి తదితరులు

భద్రాచలం /చర్ల : బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు, ఎమ్మెల్యేలకు ఎన్నికలొస్తేనే ప్రజలు, సంక్షేమ పథకాలు గుర్తొస్తాయని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన భద్రాచలం, చర్ల, మణుగూరు మండలాల్లో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా భద్రాచలంలో జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలం పూర్తిగా నష్టపోయిందన్నారు. రామాలయానికి రూ. 100 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ.1000 కోట్లు ప్రకటించి నిధులు విడుదల చేయకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. మళ్లీ ఎన్నికల సమయం వచ్చేటప్పటికీ మాయ మాటలతో గారడీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాల దరఖాస్తులకు రెండు, మూడు రోజులు మాత్రమే గడువు ఇస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టబోతున్నారని జోస్యం చెప్పారు. అనంతరం దుమ్ముగూడెం మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, సీపీఎం కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారిలో దుమ్ముగూడెం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, నలుగురు ఎంపీటీసీలు, ముగ్గురు సర్పంచులు, ముగ్గురు మాజీ సర్పంచులతో పలు సంఘాల నాయకులు ఉన్నారు. చర్ల మండలానికి చెందిన 1400 మంది కార్యకర్తలు సీపీఎం నాయకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత తెల్లం వెంకట్రావుతో పాటు చర్ల ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, భద్రాచలం, చర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ల నరేష్, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, నాయకులు బుడగం శ్రీనివాస్, చింతరెల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, బలుసు నాగ సతీష్, బొలిశెట్టి రంగారావు, తాళ్లపల్లి రమేష్ గౌడ్, బంధం శ్రీనివాస్ గౌడ్, గండేపల్లి హనుమంతరావు, సరెళ్ల వెంకటేష్, చింతిరేల సుధీర్, తరుణ్ మిత్ర, రాము, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు లంక శ్రీనివాస్, బైరెడ్డి సీతారామారావు, దర్శి సాంబశివరావు, శివ, రత్నం రమాకాంత్, రజినీకాంత్, ఎండీ నవాబ్ పాల్గొన్నారు.

పొంగులేటికి ఘన స్వాగతం..

మణుగూరు రూరల్ : టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మణుగూరులో ఘన స్వాగతం లభించింది. పీవీ కాలనీ క్రాస్‌రోడ్డు నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లోని అమరవీరుల స్థూపానికి, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పొంగులేటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాతతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్లువలా దరఖాస్తులు

- 'గృహలక్ష్మి'కి 78,467 మంది అర్జీలు
- అర్బన్ అత్యధికం, కామేపల్లిలో అత్యల్పం



ఖమ్మం అర్బన్ తహసీల్‌లోని బాక్స్‌లో దరఖాస్తు వేస్తున్న ప్రజలు

ఖమ్మం సహకారనగర్: సొంత స్థలం కలిగి ఉన్న నిరుపేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్రప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా జిల్లాలో భారీగానే దరఖాస్తులు అందాయి. ఖమ్మం కలెక్టరేట్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం సాయంత్రం వరకు 78,467దరఖాస్తులు అందాయి. జిల్లాలోని 21 మండలాల పరిధిలో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 6,340 దరఖాస్తులు రాగా... అత్యల్పంగా కామేపల్లి మండలంలో 1,979 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. మిగతా మండలాల వారీగా పరిశీలిస్తే రఘునాథపాలెంలో 4,9840, ఖమ్మం రూరల్‌లో 2,524, కూసుమంచిలో 3,551, నేలకొండపల్లిలో 3,428, తిరుమలాయపాలెంలో 4,209, సత్తుపల్లిలో 4,680, తల్లాడలో 3,455 దరఖాస్తులు అందాయి. అలాగే, కల్లూరు మండలంలో 4,742, పెనుబల్లిలో 3,753, వేంసూరులో 2,562, బోనకల్‌లో 3,053, చింతకానిలో 3,746, మధిరలో 3,656, ముదిగొండలో 3,382, ఎర్రుపాలెంలో 2,301, ఏన్కూర్‌లో 2,957, కొణిజర్లలో 4,268, సింగరేణి మండలం నుంచి 5,734, వైరా మండలం నుంచి 3,336 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు.

నేడు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం ఎన్నికలు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగుల అసోసియేషన్ గుర్తింపు ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. కర్మాగారంలోని క్యాంటీన్-1లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 6నుండి మధ్యాహ్నం 3.30గంల వరకు పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారిగా మోహన్‌కుమార్ వ్యవహరిస్తారు. మొత్తం 570 మందికి హక్కు ఉండగా, తొమ్మిది ఆఫీస్ బేరర్ పదవులకు గాను నిర్వహిస్తున్న ఎన్నికల్లో 24 మంది పోటీ పడుతున్నారు. కాగా, టీఎస్‌టీయూసీ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ ఒక కూటమిగా, టీఆర్‌టీ యూ, ఏఐటీయూసీ, సీఐటీయూ మరో కూట మిగా బరిలోనిలిచాయి. పోలైన ఓట్లను శని వారం లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

గౌరవ వేతనం కాదు.. ఫిక్స్‌డ్ వేతనం

ఖమ్మం వైద్యవిభాగం: ఆశా కార్యకర్తలకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని ఫిక్స్‌డ్ వేతనంగా మార్చాలని గురువారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత పెవిలియన్ గ్రౌండ్ వద్ద ర్యాలీని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పాషా జెండా ఊపి ప్రారంభించగా వైరారోడ్ మీదుగా జెడ్పీ సెంటర్ వరకు చేరుకుని మానవహారంగా ఏర్పడి జనరల్ ఆస్పత్రి వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ అనుబంధ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కరుణ మాట్లాడుతూ తమ సేవలను ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించి వేతనాలు పెంచారని.. ఇక నుంచి ఫిక్స్‌డ్ వేతనం ఇప్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీహెచ్.నర్సమ్మ, కె.రమణ, జి.శైలజ, అరుణ, వసంత, మంగతాయి, రజని, ధనలక్ష్మి, బుజ్జి, నీల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

సహజ వనరులను అమ్మేస్తున్న బీజేపీ

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తుందని అఖిల పక్షం కార్మిక నాయకులు ఆరోపించారు. దేశవ్యాప్త కార్మిక మహాపడావ్ సందర్భంగా గురువారం ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు సూర్యం, రామయ్య, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట రామాంజనేయులు, కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపడమే కాక కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. ఆయా సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన కార్మికులు, నాయకులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత, పాల్గొన్న డైరెక్టర్లు, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత సూచించారు. మార్కెట్ పాలకవర్గం సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరగగా, ఆదాయ, వ్యయాలు, ఇతర అంశాలపై చర్చించారు. అలాగే, మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని నిర్ణయించి, రానున్న పత్తి సీజన్‌లో ఇబ్బందులు ఎదురుకాకుండా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈసమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, గ్రేడ్-2 కార్యదర్శి బి.బజారుతో పాటు డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉదయం పువ్వాడ ఫౌండేషన్, మమత ఆస్పత్రుల ఆధ్వర్యాన 55వ డివిజన్ వేణుగోపాలనగర్‌లో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత ఇందిరానగర్‌లో జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ కోఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభించాక, 11 గంటలకు క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, సాయంత్రం 5 గంటలకు లెర్నింగ్ లైసెన్స్‌లను మంత్రి పంపిణీ చేయనున్నారు.

కోల్డ్ స్టోరేజీకి స్థలం కేటాయించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న చైర్మన్, డీసీఓ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని 12డివిజన్ వరదయ్యనగర్‌లోని ది ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకర సంఘం లిమిటెడ్(టేకులపల్లి) ద్వారా కోల్డ్‌స్టోరేజీ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన జిల్లా సహకార అధికారి విజయకుమారి, పాలకవర్గ సభ్యులతో కలిసి గురువారం కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉండగా, ప్రభుత్వం నుండి స్థలం కేటాయించినట్లు లేఖ అడిగారని చెప్పడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నాగచంద్రారెడ్డి తెలిపారు. సంఘం మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌కుమార్‌తో పాటు కుర్రా భాస్కర్‌రావు, ఇనప రాంబాబు, మన్నేపల్లి రవి, సీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన బోస్



సీపీ వారియర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అదనపు డీసీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిటీ పోలీస్ శిక్షణ కేంద్రం(సీటీసీ) అదనపు డీసీపీగా ఏ.సుభాష్ చంద్రబోస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఖమ్మం అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న బోస్ బదిలీ అయిన విషయం విదితమే.

ఇరిగేషన్ మెయింటెనెన్స్ ఫోరం కార్యదర్శిగా రమణారెడ్డి



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఇరిగేషన్ మెయింటెనెన్స్ ఫోరంలో ఖాళీ స్థానాల భర్తీకి గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటి ఆధ్వర్యాన ఈ సమావేశం జరగగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా ఈశ్వర్ బహదూర్, కార్యవర్గ సభ్యుడిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్ హసన్ సన్మానించి ఉద్యోగులకు హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు నీరుకొండ చంద్రశేఖర్‌తో పాటు భాగం పవన్, నాగుల్ మీరా, వెంకట్‌రెడ్డి, స్వప్న, శాబాసు జ్యోతి, బుద్దా రామకృష్ణ, పురుషోత్తంరెడ్డి, సువర్షన్ పాల్, పిరంగి శ్రీను, సుంచు వీరనారాయణ, నగేష్ పాల్గొన్నారు.

పోటీలకు మార్గం సుగమం

- సెప్టెంబర్‌లోగా జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు
- ఏడు జోన్లకు బదులు ఎనిమిది జోన్లుగా ఖరారు
- కమిటీల్లో మరో నలుగురికి చోటు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో పాఠశాలల స్థాయి క్రీడాపోటీల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈఏడాది(2023–2024)కి గాను జాతీయస్థాయి క్రీడల క్యాలెండర్ వెలువడంతో విద్యాశాఖ అధికారులు పోటీలకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు కొనసాగిన పాత ఏడు జోన్ల స్థానంలో ఎనిమిది జోన్లు ఖరారు చేశారు. అలాగే, కమిటీల్లో నలుగురికి మాత్రమే స్థానం కల్పిస్తుండగా, మరో నలుగురికి కూడా చోటు కల్పించాలని నిర్ణయించారు.

పోటీలు ఇలా...

పాఠశాలల క్రీడల నిర్వహణకు సంబంధించి క్యాలెండర్‌ను ఈసమావేశంలో ఖరారు చేశారు. మండల స్థాయిలో సెప్టెంబర్ 16లోపు, జోనల్ స్థాయి పోటీలు 27వ తేదీలోపు, సెప్టెంబర్ 29, 30వ తేదీలోపు జిల్లాస్థాయి పోటీలు పూర్తిచేయాలని నిర్ణయించారు. జోన్లవారీగా పీఈటీలు, పీడీలు సమావేశాలు ఏర్పాటుచేసుకుని ప్రణాళిక సిద్ధం చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ ఆదేశించారు. తాజా నిర్ణయం మేరకు సత్తుపల్లి, వైరా, తల్లాడ, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, మధిర, కారేపల్లి, ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ జోన్లు ఉంటాయని తెలిపారు. జోన్‌స్థాయి పోటీలు ముగిశాక జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేస్తామని, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించాకే తుది జట్లను ప్రకటించాలని సూచించారు. కాగా, పోటీల నిర్వహణకు అవసరమైన నిధులను ఉమ్మడి పరీక్షల విభాగం(డీసీఈబీ) నుంచి అందజేయనున్నట్లు డీఈఓ శర్మ తెలిపారు.

ఎవరు అర్హులు

క్రీడల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తూ జోన్, జిల్లాస్థాయి పోటీల్లో ప్రతీ పీఈటీ, పీడీ విధిగా క్రీడా మైదానంలో ఉండాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, అండర్–14 పోటీలకు 01-01-2010లోపు, అండర్–17 పోటీలకు 01-01-2007 లోపు జన్మించిన బాలబాలికలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహారెడ్డితో పాటు పి.లక్ష్మయ్య, సునీత, ఆదర్శ్‌కుమార్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

జోన్ల వారీగా మండలాలు

సత్తుపల్లి జోన్‌లోకి సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు మండలాలు వస్తాయి. అలాగే, తల్లాడ జోన్‌లో తల్లాడ, ఏన్కూరు, రఘునాథపాలెం జోన్‌లో కొణిజర్ల, చింతకాని, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం జోన్‌లో తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాలు ఉంటాయి. ఇంకా మధిర జోన్‌లోకి మధిర, బోనకల్, ఎర్రుపాలెం, కారేపల్లి జోన్‌లోకి కారేపల్లి, కామేపల్లి, ఖమ్మం రూరల్ జోన్‌లోకి ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాలు కేటాయించగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని ప్రత్యేక జోన్‌గా నిర్ధారించారు.

బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లకు రూ.58.90 కోట్లు

- సత్తుపల్లి నియోజకవర్గంలో పలు చోట్ల నిర్మాణం
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో హైలెవల్ బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.58.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు నిధులు వివరాలను గురువారం వెల్లడించిన సండ్ర వెంకటవీరయ్య... ప్రతిపాదనలను ఆమోదించి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్కడెక్కడంటే...

నియోజకవర్గంలోని తల్లాడ మండలం నూతనకల్ నుంచి గూడూరు మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సండ్ర వెల్లడించారు. అలాగే, లోకవరం–పెనుబల్లి మధ్య రెండు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.15 కోట్లు, తల్లాడ మండలం మిట్టపల్లి కట్టలేరు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.37 కోట్లు, అంజనాపురం–రేజర్ల దేవిపాడు వాగుపై చెక్‌డ్యామ్‌కు రూ.2.93 కోట్లు, పినపాక కట్టలేరు వాగుపై చెక్‌డ్యామ్ కోసం రూ.3.73 కోట్లు, రంగంబంజరు జల్లవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.1.66 కోట్లు, కుర్నవల్లి కట్టలేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.8.94 కోట్లు, కుర్నవల్లి పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2.32 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా కల్లూరు మండలం యజ్ఞనారాయణపురం పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.93 కోట్లు, తాళ్లూరు వెంకటాపురం పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.1.68 కోట్లు, పేరువంచ కాత్రవాని వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2.15 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో లోలెవల్ వంతెనల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులు తీరతాయని, చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయని ఎమ్మెల్యే సండ్ర వివరించారు.

‘చలో హైదరాబాద్’కు తరలిరావాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఎస్ సీపీఎస్‌ఈయూ) జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శిధర్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆవరణలో కార్యక్రమ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో చేస్తున్న పోరాటంలో జిల్లా నుంచి ఉద్యోగులు భారీగా తరలిరావాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, సుభాన్, యరమళ్ల శ్రీనివాసరావు, శ్వేత, ఆర్.వీ.ఆర్.ప్రసాద్, రవిచంద్ర, శారద, నిశ్చల, శంకర్, పవన్, నెల్లూరి రవి, ఏకవీర, కుమార్, జిలానీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తహసీల్దార్ విచారణ



ఆస్పత్రిలో విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నంచందర్

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎం.అరవింద్ బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఆయనతో ఇటుకలు మోయించే సమయాన ప్రమాదం జరిగిందని తెలియడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం తహసీల్దార్ పున్నంచందర్ పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మంలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి ఆయన తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మయూరిసెంటర్: బోనకల్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో విద్యార్థితో ప్రిన్సిపాల్, సిబ్బంది ఇటుకలు మోయించడంతోనే గోడ కూలి గాయపడ్డాడని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. ఈమేరకు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు అదనపు కలెక్టర్, బీసీ గురుకులాల ఆర్‌సీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి కోటేశ్వరరావు, నాయకులు దీపిక, పార్థవి, పృథ్వీ పాల్గొన్నారు. కాగా, చికిత్స పొందుతున్న విద్యార్థి అరవింద్‌ను బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దాస్ మహరాజ్, నాయకులు నాగరాజు, సుభాష్ చంద్ర బోస్ పరామర్శించారు.

బీసీలకు అవకాశం కల్పించాలి



సీఎల్పీ నేత భట్టికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కనీసం రెండు అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు అవకాశం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ కోరారు. ఈసందర్భంగా ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారితో కలిసి గురువారం సీఎల్పీనేత భట్టి విక్రమార్కకు వినతిపత్రం పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు జిల్లాలో ప్రాధాన్యత లేదని, ఇకనైనా కనీసం రెండు సీట్లు కేటా యించాలని కోరారు. సీట్లు కేటాయించే పార్టీతోనే తమ పయనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగబోయిన పుల్లారావు, సుగుణ, చల్లా హన్మంతు, పామర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

16 నుండి రెండో ఏఎన్‌ఎంల సమ్మె



ఐడీఓసీ ఎదుట ధర్నాలో ఏఎన్‌ఎంలు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రెండో ఏఎన్‌ఎంల సర్వీస్ రెగ్యులర్ చేయడంతో హేతుబద్ధంగా లేని నోటిఫికేషన్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్‌ఎంల యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు తెలిపారు. ఈసందర్భంగా గురువారం కలెక్టర్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాటట్లాడారు. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఈనెల 4న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినా ఎమ్మెల్యేలెవరూ చర్చించలేదని చెప్పారు. ఇటీవల రాష్ట్రంలో 5,554 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం, 15 ఏళ్ల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, సీహెచ్.సీతామహాలక్ష్మి, బడేటి వనజ, సీహెచ్.విజయలక్ష్మి, తమ్మారపు జయమ్మ, ధనలక్ష్మి, లలితకుమారి, రజిని, ఎం.నాగమణి, బి.నాగమణి పాల్గొన్నారు.

రిజర్వాయర్ రహదారి విస్తరణపై చర్చలు

66 అడుగులైనా ఉండాల్సిందేని ఎమ్మెల్యేకు నేతల వినతి



విజయాబాయిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

వైరా: వైరాలోని రిజర్వాయర్‌కు వెళ్లే రహదారి విస్తరణ వివాదం కొనసాగుతోంది. ఒకవైపే షాపులు తొలగించడంతో అఖిలపక్షంగా ఏర్పడిన వివిధ పార్టీల నాయకులు అడ్డుకుని రెండు రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. ఈమేరకు గురువారం నాయకులు ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కలిసి మాట్లాడారు. రిజర్వాయర్‌కు వెళ్లే రహదారి కనీసం 66 అడుగులైనా ఉండేలా విస్తరించాలని, తద్వారా భవిష్యత్‌లో ఇబ్బందులు రావని చెప్పారు. ఈక్రమంలోనే కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయాబాయి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించడంతో ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ నాయకులు కలగజేసుకుని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో క్యాంపు కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఎమ్మెల్యే సమావేశం నుంచి వెళ్లిపోయారు. శుక్రవారం మరోమారు క్యాంపు కార్యాలయంలో రహదారి వెడల్పుపై అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బొంతు రాంబాబు, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, యామాల గోపాలరావు, పాదిల హరినాథ్, ఏదునూరి సీతారాములు, కంకణాల అర్జునరావు, పి.సైదులు, ఫణితి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సతీమణి మృతిపై సంతాపం



సరళాదేవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రజా వైద్యులు యలమంచిలి రాధాకృష్ణమూర్తి సతీమణి సరళాదేవి గురువారం మృతి చెందారు. అనారోగ్య కారణాలతో ఆమె మృతి చెందగా, ఖమ్మంలోని నివాసంలో పలువురు నివాళులర్పించి ఆమె కుమారులు డాక్టర్ రవీంద్రనాథ్, రామకోటేశ్వర్‌రావును పరామర్శించారు. సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు – విజయలక్ష్మి దంపతులు, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీర య్య, పువ్వాడ జయశ్రీ, మేయర్ నీరజ, డీసీసీబీ, మార్కెట్, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, శ్వేత, విజయ్‌కుమార్ తదితరులు సరళాదేవి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, సీపీఎం, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, పోటు రంగారావుతో పాటు వివిధ పార్టీల నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, పి.సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్, వై.విక్రమ్, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, గోకినపల్లి వెంకటేశ్వరరావు, ఎం.డీ.ఖమర్, చిరుమామిళ్ల రవికిరణ్, రమేష్‌గౌడ్, డోన్‌వాన్ రవి కూడా సరళాదేవి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు



సాయిమనోజ్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన గబ్బిలాల సాయిమనోజ్(18) తన స్నేహితులు అడపా నాని అలియాస్ సీతారామచౌదరి, కోరుకొండ రాజేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బేతుపల్లి నుంచి మర్లపాడు వెళ్తున్నారు. ఈక్రమంలో నారాయణపురం మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. సాయిమనోజ్ తలపైనుంచి లారీ వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, నాని, రాజేష్‌కు గాయాలు కావటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మనోజ్ కుటుంబ సభ్యులు చేరుకుని మృతదేహంపై పడి రోదించిన తీరు కంటతడి పెట్టించింది. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఘటనా స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ద్విచక్రవాహనం చోరీ

సత్తుపల్లిటౌన్: ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సత్తుపల్లి ప్రకాశం పంతులు వీధిలోని సాయిరాం టవర్స్ అపార్ట్‌మెంట్‌లో పొలగాని భార్గవ్ నివాసముంటున్నాడు. ఆయన సెల్లార్‌లో నిలిపిన ద్విచక్రవాహనం గురువారం ఉదయం కనిపించలేదు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు వచ్చి ఎత్తుకెళ్లినట్లు గుర్తించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన చెప్పల వెంకన్న(48) గురువారం రోడ్డు దాటుతుండగా, సత్తుపల్లి నుంచి ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న వేంసూరు మండలం లింగపాలెంకు చెందిన సూర్యం ఢీకొట్టాడు. ఈఘటనలో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి యువకుడు...

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడికి చెందిన యువకుడు దార్శ అఖిల్ (23) తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అఖిల్ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఇంతలోనే ఆయన పొలం వైపు వెళ్తుండగా చూశామని రైతులు చెప్పారు. ఈమేరకు గురువారం ఉదయం బావి వద్ద పరిశీలించగా చెప్పులు ఉండడంతో వెతకగా అఖిల్ మృతదేహం బయటపడింది. తాగునీటి కోసం వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు బావిలో పడి ఉంటాడని అఖిల్ తండ్రి నాగేశ్వరరావు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, అఖిల్ సోదరుడు అశోక్ కూడా ఐదేళ్ల క్రితం మృతి చెందినట్లు తెలిసింది.

సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

భూవివాదంలో న్యాయం చేయాలని కోరిన రైతు



సెల్‌టవర్‌పై మంగీలాల్

రఘునాథపాలెం: భూమి విషయమై నెలకొన్న వివాదంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాలప్పడ్డాడు. రఘునాథపాలెం మండలం హర్యాతండా శివారులో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. హర్యాతండాకు చెందిన గుగులోతు నంద 2007లో ఎకరం భూమిని మంచుకొండ వాసికి, ఆయన ఖమ్మం వ్యాపారికి విక్రయించాడు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నారు. అయితే నంద కుమారుడైన మంగీలాల్ ఎకరం భూమి కాకుండా 12కుంటలు అదనంగా ఉందని చెబుతూ సర్వే చేయించగా నిజమేనని తేలింది. దీంతో పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహిస్తే అదనంగా నగదు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నా డబ్బులు ఇవ్వలేదని సమాచారంతో దీంతో మంగీలాల్ గురువారం ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా లేఖ రాసి సెల్ టవర్ ఎక్కాడు. ఈ విషయం తెలిసిన ఎస్ఐ కొండలరావు చేరుకుని నచ్చచెప్పినా ఆయన వినలేదు. ఎట్టి పరిస్థితుల్లో న్యాయం చేస్తామని చెప్పడంతో మంగీలాల్ టవర్ దిగాడు. అయితే, భూమి కొనుగోలు చేసిన వారితో ఎస్సై మాట్లాడగా మధ్యలో రోడ్డు ఉందని, అది పోగా ఎకరం మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని చెప్పడంతో పూర్తి వివరాల కోసం రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. అలాగే, ఆత్మహత్యకు యత్నించిన మంగీలాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బిడ్డకు విషం ఇచ్చి... తానూ మింగి...

నేలకొండపల్లి: ఆ తల్లికి ఏం కష్టం వచ్చిందో ఏమో కానీ... మూడేళ్ల కుమారుడికి విషం తాగించి, తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించడంతో ఆమె ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడగా, చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన కట్టికోల శ్రావణి–హరీష్ దంపతులు నేలకొండపల్లిలో నివాసముంటున్నారు. గురువారం హరీష్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనికి వెళ్లాక శ్రావణి ఆత్మహత్య చేసుకుందామని భావించింది. ఇంట్లో ఉన్న బొద్దింకల మందు తాగే సమయాన కుమారుడు షణ్ముక్ రోదిస్తూ కనిపించడంతో తనకు మందు తాగించి శ్రావణి మింగింది. ఇరువురు అపస్మారక స్థితిలో పడిపోగా, ఇంటికి వచ్చిన స్థానిక మహిళ గుర్తించి ఇరుగుపొరుగు సహకారంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. ప్రస్తుతం తల్లీ కుమారుడు చికిత్స పొందుతుండగా, చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, శ్రావణి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియలేదు.

ఫిట్స్‌తో అవివాహిత యువతి మృతి

ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భవతి

ఖమ్మంఅర్బన్: నీట్ కోసం ఒక సంస్థలో శిక్షణ పొందుతున్న యువతి(18) ఫిట్స్‌తో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి కథనం ప్రకారం.. ముదిగొండ మండలానికి చెందిన యువతి గత ఏడాది ఇంటర్ పూర్తిచేయగా, నీట్ శిక్షణ కోసం హైదరాబాద్‌లోని సెంటర్‌లో చేర్పించారు. అయితే, రెండు నెలల క్రితం ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలో ఉంటున్న మేనత్త వద్దకు వచ్చిన ఆమె ఇక్కడే ఉంటోంది. కాగా, బుధవారం రాత్రి ఫిట్స్‌తో పడిపోవడంతో నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న యువతి గురువారం మృతి చెందింది. కాగా, సదరు యువతి ఎనిమిది నెలలు గర్భవతి అని వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు అవాక్కయ్యారు. ఇప్పటివరకు విషయం తమకు తెలియదని చెబుతూ, విచారణ జరపాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.